అల్లం నారాయణ పరామర్శ

నివాళి అర్పిస్తున్న అల్లం నారాయణ

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 20: టీయూడబ్ల్యూజే హెచ్-143 జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ తల్లి జయమ్మ ఇటీవల మృతిచెందారు. శ్రీనివాస్‌ను ఆదివారం ఆయన ఇంటి వద్ద యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ పరామర్శించారు. జయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, కోశాధికారి యోగి, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 20: ఒకటి నుంచి పదోతరగతి వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ)-1 పరీక్షలు సోమవారం నుంచి జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం నవంబర్ 2న మూల్యాంకనం చేసి, 5వ తేదీన మార్కులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసి, 16వ తేదీన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఫలితాలను వెల్లడించనున్నట్లు వివరించారు.

నవభారత్ పూర్వ ఉద్యోగుల సమ్మేళనం

సన్మానం అందుకుంటున్న పూర్వ ఉద్యోగులు

పాల్వంచ, అక్టోబర్ 20: పాల్వంచలోని నవభారత్ కర్మాగారం పూర్వ ఉద్యోగుల సమ్మేళనం ఆదివారం స్థానిక లారీ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. విశ్రాంత ఉద్యోగులను సమ్మేళనం నిర్వాహ కమిటీ సభ్యులు శాలువాలు, పూల బొకేలతో సత్కరించారు. ఆలీ, వై.సుబ్బారావు, పీవీ సుబ్బారావు, పీఎస్‌ఎన్ రెడ్డి, సమ్మయ్య, ఎన్‌పీ చారి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

పాల్వంచ, అక్టోబర్ 20: మండలంలోని బొల్లోరిగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1985-86 విద్యాసంవత్సరం పదోతరగతి విద్యార్థుల రెండవ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీ వేదికగా జరిగింది. వంద మందికి హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ప్రతి సంవత్సరం ఇలాగే కలవాలని నిర్ణయించుకున్నారు.

ఆయుర్వేద మందులు పంపిణీ

ఆళ్లపల్లి, అక్టోబర్ 20: ప్రముఖ వ్యాపారవేత్తలు అనుమోల వెంకటేశ్వరరావు, వెలిశాల రామ్మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఆయుర్వేద మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైద్రాబాద్‌లోని ఆయుర్వేద డాక్టర్ సలహా మేరకు మానవతా దృక్పథంతో ప్రజలకు ఉచితంగా మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమరం హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు పడిగ సమ్మయ్య, గ్రామస్తులు చిన్నవెంకన్న, పొదిలరాము, వెంకటేశ్వర్లు, సత్యం, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 20: మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన మంచ సత్యనారాయణ అనారోగ్యంతో ఇటీవలే మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు విషయం తెలుసుకున్న అదేగ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు అఖిల్ అహ్మద్ వారి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి ఉన్నత చదువులకు రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వైద్యులు తంగిళ్ళపల్లి శ్రీనివాస్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో అట్లతద్ది వేడుకలు

టేకులపల్లి, అక్టోబర్ 20: టేకులపల్లిలోని గుడిపూడి సత్యనారాయణ ఇంటి ఆవరణలో ఆశ్వయుజ బహుళ తదియ సందర్భంగా అట్లతద్ది వేడుకలలో భాగంగా గౌరమ్మను ఏర్పాటు చేసి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు అట్లు ఒకరికొకరు వాయనంగా ఇచ్చి పుచ్చుకున్నారు.

సూరిబాబు కుటుంబానికి తాటి పరామర్శ

దమ్మపేట, అక్టోబర్ 20: మండలంలోని తాటి సుబ్బన్నగూడెం గ్రామానికి చెందిన తాటి సూరిబాబు సంస్మరణ సభ ఆదివారం జరిగింది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు హాజరై సూరిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం సూరిబాబు విగ్రహాన్ని వ్యవసాయ క్షేత్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోయం వీరభద్రం, బండారి సూర్యనారాయణ, వాడే వీరాస్వామి, నాగేశ్వరరావు, కన్నెబోయిన వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

రైతులకు సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి

ఇల్లెందు:మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్

మణుగూరు టౌన్: రాస్తారోకో చేస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

ఇల్లెందు, అక్టోబర్ 20: రాష్ట్రంలో రైతులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కింద ఎకరాకు 15వేల ఇస్తానని నేటికి రైతుభరోసా ఇవ్వని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందు పట్టణంలో జగదాంబ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు రైతులు, బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో రైతు భరోసా వెంటనే అమలు చేయాలని ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతుభరోసా ఇవ్వలేమని సాక్షాత్తు మంత్రి తుమ్మల వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రైతులకు ఇచ్చిన హామీలలో ప్రభుత్వం రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు దిండిగల రాజేందర్, సిలివేరు సత్యనారాయణ, జేకే శ్రీను, దేవిలాల్,అజ్మీర బావుసింగ్, శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, పరుచూరి వెంకటేశ్వర్లు, దాస్యం ప్రమోద్, అబ్దుల్ నబీ, జబ్బర్, మహేందర్, ఆదురి రవి, యలమద్ది రవి, హరిప్రసాద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా వెంటనే అమలు చేయాలి

మణుగూరు టౌన్: బీఆర్‌ఎస్ నాయకులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తున్నపోలీసులు

టేకులపల్లి, అక్టోబర్ 20: రాష్ట్రంలో రైతులకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతుభరోసా వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలునాయక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రైతులు, బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా చేపట్టారు. హరిప్రియనాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ పూర్తి అయినా రైతులకు రైతుభరోసా అందక పెట్టుబడి కోసం ఇబ్బందులుపడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో రైతులకు పెట్టుబడి సాయం సీజన్ల ప్రకారం సకాలంలో అందేదన్నారు. అధికారం కోసం అమలుకాని హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, నాయకులు బానోత్ కిషన్, చీమల సత్యనారాయణ, జాలది అప్పారావు, బర్మవత్ శివ, కుమ్మరి కిరణ్‌కుమార్, బాలకృష్ణ, మాలోత్ పూల్‌సింగ్, అజ్మీర గలక, బానోత్ ఈరు, భూక్యా లాలునాయక్, సురేశ్, మూడ్ బాలు, శివ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

మణుగూరు టౌన్, అక్టోబర్ 20: ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 300రోజులు దాటినా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, రైతులకు ఇప్పటి వరకు రైతుభరోసాను అందించలేదని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ నేతలు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ... రైతుభరోసా లేకపోవడంతో పంటలకు పెట్టుబడులు పెట్టలేక, అధిక వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి సరైన దిగుబడి రాక రైతు దిగాలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని అన్నా రు. రైతులకు మేలు చేసే ప్రభుత్వమని చెప్పుకోవడం కాద ని, చేతల్లో చూపించాలని అన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ కూడా సగం మంది రైతులకే చేశారని, మిగిలి న వారు రుణమాఫీ కాలేదని ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చే యాలన్నారు. రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు పోశం నర్సింహారావు, అడపా అప్పారావు, ముత్యం బా బు, కురి నాగేశ్వరరావు, వట్టం రాంబాబు, నూకారపు రమేశ్, యాదగిరి గౌడ్, లక్ష్మణ్, కోటి, రంజిత్, రవి పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, అక్టోబర్ 20: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధ్రువమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

రామయ్యను దర్శించుకున్న ఎస్పీ దంపతులు

పూజలు చేస్తున్న ఎస్పీ దంపతులు

భద్రాచలం, అక్టోబర్ 20: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత అర్చకులు వారికి స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద పూజలు చేసిన అనంతరం గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలోని ఉప ఆలయాలు శ్రీలక్ష్మీతాయారు, శ్రీఅభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భద్రాచలం సీఐ సంజీవరావు, ఎస్సైలు, అర్చకులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రామాలయ సిబ్బంది విధుల్లో మార్పులు

భద్రాచలం, అక్టోబర్ 20: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆలయ సిబ్బంది విధుల్లో మార్పులు చేసినట్లు ఆలయ ఈవో రమాదేవి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సీనియర్ అసిస్టెంట్ ఎం.కృష్ణస్వామిని సీఆర్‌వోగా (సత్రాల శానిటేషన్ ఫైల్ కరస్పాండెన్స్‌తో సహా అన్నదానం, కల్యాణకట్ట), జూనియర్ అసిస్టెంట్‌లు ఆర్.శ్రీకాంత్, టి.రాకేష్, బి.సుష్మలను ల్యాండ్స్, లీజెస్, లీగల్ మ్యాటర్స్ గుమాస్తా, క్యాషియర్‌గా, రికార్డ్ అసిస్టెంట్ బీకేవీవీఎస్ శ్రీనివాస్ ఆలయ పరిశీలకులు, ఆలయ ఫైల్ కరస్పాండెన్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగ గుమాస్తా సహాయకులుగా మార్పు చేశారు. అదేవిధంగా రికార్డ్ అసిస్టెంట్ కె.కుమారిని పోస్ట్ ఆడిట్, వార్షిక ఉత్సవాలు, శ్రీరామదీక్ష దత్తత దేవాలయాలుతో పాటు అదనంగా రికార్డ్‌రూమ్, డిస్పాచ్ విభాగం ఇన్‌చార్జ్‌గా, అటెండర్లు ఎం.గోపాలకృష్ణ, పీవీవీఎన్‌వీ ప్రసాద్‌లు డిస్పాచ్ విభాగం గుమాస్తా, సహాయక విధులు, అకౌంట్స్ సెక్షన్‌లో డైలీ క్యాష్ బ్యాంక్ ఖాతాలకు జమచేయడం, ల్యాండ్స్ విభాగంలో విధులు నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు ఎం.సునీత, ఎం.మృణాళిని, క్లర్క్ వి.సుబ్బారావు, కె.అశోక్(ఓఎస్)లకు మేజర్ ఫెస్టివల్స్, ఆన్‌లైన్ సేవలు ఎస్టాబ్లిష్‌మెంట్ మినహాయింపు, ల్యాండ్స్, లీజెస్, లీగల్ మ్యాటర్స్, ఆలయ మేజర్ ఫెస్టివల్స్, రంగనాయకులగుట్టపై టీటీడీ, అన్నదానం విధులకు మార్పు చేశారు. వీరంతా కేటాయించిన విధుల్లో వెంటనే చేరాలని, చేరి జాబితాను కార్యాలయంలో సమర్పించాలని ఆలయ ఈవో తెలిపారు.

నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్

భద్రాచలం, అక్టోబర్ 20: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. గిరిజనులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని తెలిపారు.

బిషప్‌గా విక్రమరాజు

పర్ణశాల, అక్టోబర్ 20: దుమ్ముగూడెం మండలం పెద్దనల్లబెల్లి గ్రామానికి చెందిన విక్రమరాజు ఆదివారం బిషప్‌గా ఎన్నికయ్యారు. వరల్డ్ వైడ్ యంగ్లికన్ చర్చి భారత దేశ పీఠాధిపతి అయిన ఆర్చి బిషప్ వీ మోజెస్ పాల్ (చెన్నై) ద్వారా 40వ బిషప్‌గా అతి చిన్న వయస్సులోనే ఎన్నికయ్యారు. సామాన్యమైన క్షత్రియ కుటుంబంలో జన్మించి ప్రపంచ వ్యాప్తంగా 256 దేశాల్లో వ్యాపించి ఉన్న వరల్డ్ వైడ్ అంగ్లికన్ చర్చి నుంచి బిషప్‌గా ఎన్నిక కావడం హర్షణీయమని పాస్టర్లు, విశ్వాసులు అన్నారు.

కొత్త రైల్వేలైన్ భూసర్వే చేయాలి

మణుగూరు, అక్టోబర్ 20: మణుగూరు నుంచి రామగుండం వరకు కొత్త రైల్వే లైన్ కోసం భూ సర్వే చేయాలని భూ సేకరణ సబ్ కలెక్టర్‌ను నియమిస్తూ ప్రభుత్వం గెజిటెడ్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 16వ తేదీన జీవోను సౌత్ సెంట్రల్ రైల్వే అధికారికంగా విడుదల చేస్తూ మణుగూరు, పినపాక, మేడారం మీదుగా జయశంకర్ భూపాపల్లి జిల్లాలోని మల్హార్‌రావు, కపురాం, ఘన్‌పూర్, భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం, మంతని, రామగిరిని కలుపుతూ ఈ రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో మణుగూరు నుంచి రామగుండం వరకు ప్రయాణ మార్గం సుగమం కానుంది.

గౌతంపురం-సోంపల్లికి బీటీ రోడ్డుకు నిధులు మంజూరు

బూర్గంపహాడ్, అక్టోబర్ 20: మండల కేంద్రమైన బూర్గంపహాడ్ గౌతంపురం నుంచి సోంపల్లి వరకు 1.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ. కోటి నిధులు మంజూరు చేశారు. రైతులు, ప్రజలు, నాయకులు ఈ సమస్యపై ఎమ్మెల్యేకు విన్నవించగా బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అన్నదాతలకు మోసం చేసిన కాంగ్రెస్

మాట్లాడుతున్న పగడాల సతీశ్‌రెడ్డి

పినపాక, అక్టోబర్ 20: ఎన్నికల ముందు అన్నదాతలను ఆదుకుంటామని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్నదాతలకు మొండి చేయి చూపి మోసం చేసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన ఈ బయ్యారం అడ్డరోడ్డులోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా వారు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి సగం మంది రైతులకు కూడా రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయలేదని ఆరోపించారు. వర్షాకాలం పంట పూర్తిఅయి వరి కోతలు నడుస్తున్న రైతు భరోసా పథకం డబ్బులు నేటికీ అందజేయలేదని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, భవాని శంకర్, వాసు బాబు, బుల్లి బాబు, కొండేరు రాము, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాసర్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

దుర్గా భవాని మాత ఆలయంలో చండీయాగం

పూజలు చేస్తున్న సింగరేణి అధికారులు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 20: దుర్గాదేవీ నవరాత్రుల్లో భాగంగా జేకే 5 ఓసీలోని దుర్గా భవాని మాత ఆలయంలో నిర్వహించిన మహాచండీ యాగాన్ని ఎస్‌వో టూజీఎం బొల్లం వెంకటేశ్వర్లు దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పీవో కృష్ణ మోహన్, జనరల్ మేనేజర్ మల్లెల సుబ్బారావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రామస్వామి, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, మేనేజర్ పూర్ణచందర్, గని సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ప్రాజెక్టు ఇంజినీర్ చిన్నయ్య, పర్సనల్ అధికారి సుధాకర్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, మహేశ్, గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ సారయ్య, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శులు సంజీవచారి, నవీన్, అధికారులు, ఉద్యోగులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'టీయూసీఐలో విలీనంతో సంబంధం లేదు'

మాట్లాడుతున్న గౌని నాగేశ్వరరావు

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 20: టీయూసీఐలో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ-ఇఫ్టూ) విలీనం పేరుతో కొందరు చేస్తున్న గందరగోళ ప్రకటనలతో తమకు ఏమాత్రం సంబంధం లేదని ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆయన ఆదివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఈ విషయం చెప్పారు. విలీన ప్రకటనతో ఇఫ్టూ శ్రేణులు, కార్మికులు గందరగోళపడుతున్నారని అన్నారు. ఇఫ్టూ అవగాహనతో, విధానాలతో విభేదిస్తున్న కొందరు మాత్రమే బయటకు వెళ్లి, ఇలా విలీన ప్రకటనలు చేస్తున్నారని వివరించారు. వీటితో ఇఫ్టూ జాతీయ కమిటీకిగానీ, తెలంగాణ రాష్ట్ర కమిటీకిగానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నాయకులు మోత్కూరి మల్లికార్జున్‌రావు, వెంకటమ్మ, కృష్ణ, మంగ, సతీష్ పాల్గొన్నారు.

ఇల్లెందుకు రైలును పునరుద్ధరించాలి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 20: ఇల్లెందుకు రైలు మార్గాన్ని పునరుద్ధరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు అబ్దుల్ నభి డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందు రైల్వేస్టేషన్ సమీపంలో ఆందోళన చేపట్టి మాట్లాడారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ ఇచ్చిన మాట ప్రకారం ఇల్లెందుకు రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రైలును తీసివేయడంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ అధినేత బీఎన్‌ఆర్‌కు నంది అవార్డు ప్రదానం

నంది అవార్డు అందుకుంటున్న బీఎన్‌ఆర్ దంపతులు

బూర్గంపహాడ్, అక్టోబర్ 20: సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్‌ఆర్‌కు రాష్ట్రస్థాయి నంది అవార్డు దక్కింది. ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ బాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో జీసీఎస్ వల్లూరి, ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సంఖ్యాశాస్త్రజ్ఞులు దైవజ్ఞ శర్మ, సినీ ఆర్టిస్టుల చేతులమీదుగా బీఎన్‌ఆర్ దంపతులు ఈ అవార్డును అందుకున్నారు.

25నుంచి మాలల మహాపాదయాత్ర

బూర్గంపహాడ్, అక్టోబర్ 20: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళితుల ఐక్యత కోసం జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో భద్రాచలంలో ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే మాలల మహాపాదయాత్ర కరపత్రాలను మాలమహానాడు నాయకులు ఆదివారం మండలంలోని మోరంపల్లిబంజర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి తోటమళ్ల రమణమూర్తి, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు, పాదయాత్ర జిల్లా కమిటీ బాధ్యులు గణపతి, పల్లంటి రమేశ్, బోడ దివ్య, మద్దేటి జయ, బొజ్జ వెంకటేశ్వర్లు, శెనగ నర్సింహారావు, శెనగ నిర్మల, శెనగలక్ష్మి, బర్ల నరసమ్మ పాల్గొన్నారు.

మాలల పాదయాత్రను జయప్రదం చేయండి

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 20: ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే మాలల పాదయాత్రను జయప్రదం చేయాలని అశ్వారావుపేట మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం వారు మాట్లాడుతూ 25న భద్రాచలంలో ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర 16 జిల్లాల్లో , 35 నియోజకవర్గాల్లో వెయ్యి కిలోమీర్లు 38 రోజులు పాటు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లాడి రామారావు, పచ్చినేల రాజా, వెంకటరత్నం పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజ్, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఆటోను ఢీకొన్న లారీ

చుంచుపల్లి, అక్టోబర్ 20: ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఒకరికి గాయాలయ్యాయి. విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్డు వద్ద సంత రోడ్డుకు వెళ్లేందుకు ఆటో క్రాస్ చేస్తున్నది. అదే సమయంలో, సుజాతనగర్ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీ, ఆ ఆటోను వెనుక నుంచి ఢీకొంది. ఆటో బోల్తా పడడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సరిగ్గా అప్పుడే, కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు, పడిపోయిన ఆటోను ఢీకొంది. బస్సు స్వల్పంగా ధ్వంసమైంది.

ముగ్గురుకి రిమాండ్

ఇల్లెందు, అక్టోబర్ 20: విలేకరిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తెలిపారు. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17తేదీ రాత్రి విలేకరిపై జరిగిన దాడిలో రెడ్డిబోయిన వంశీకృష్ణ, మూచకుర్తి ప్రేమ్ కుమార్, ఎడారి ఉదయ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి సదరు పిటిషనర్ సుదర్శన్‌ను కొట్టడానికి ఉపయోగించిన ఇనుపరాడ్డును, బీరు సీసాలను సీజ్ చేశారు. మిగిలిన పరారీలో ఉన్న వ్యక్తులను త్వరలో పట్టుకొని కోర్టు ముందు హాజరుపరుస్తామన్నారు.

దాడి దుండగులపై చర్యలకు వినతి

పాల్వంచ, అక్టోబర్ 20: ఇల్లెందులో విలేకరిపై దాడి చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పాల్వంచ ప్రెస్‌క్లబ్ బాధ్యులు ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అధ్యక్షుడు కొండలరావు, కార్యదర్శి షేక్ సుభాని, సభ్యులు చంద్ర నరసింహారావు, శనగా రాంచందర్‌రావు, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెల్ల తాచుపాము పట్టివేత

పాల్వంచ, అక్టోబర్ 20: తెల్ల తాచుపాము పట్టుబడింది. స్థానిక ఆడమ్స్ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని ఆయిల్ మిల్‌లో ఆదివారం అక్కడి హమాలీలకు పది అడుగుల పొడవున్న తెల్ల తాచుపాము కనిపించింది. దానిని చూడగానే వారు భయకంపితులయ్యారు. మిల్లులోని ఎలుకల కోసం అది వచ్చి ఉంటుందని భావించారు. దానిని బయటకు వెళ్లగొట్టేందుకు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. హమాలీలు ఇచ్చిన సమాచారంతో స్నేక్ క్యాచర్ వచ్చి, ఆ పామును పట్టుకుని, పాల్వంచలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దుమ్ముగూడెం, అక్టోబర్ 20: ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిన వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని ములకపాడులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పాల్వంచ మండలం ఉల్వనూరుకు చెందిన పాయం నర్సింహసాగర్ ద్విచక్రవాహనంపై ఆర్లగూడెం వెళ్తుండగా ములకపాడుకు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యా. గమనించిన స్థానికులు నర్సింహసాగర్‌ను దుమ్ముగూడెం పీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స నిర్వహించగా పరిస్థితి విషమించడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

అశ్వారావుపేట, అక్టోబర్ 20: కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేసి జూదరులను అరెస్టు చేశారు. మండలంలోని కేశప్పగూడెం గ్రామ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై యయాతి రాజు సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.6,300, 4 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐద్వా మహాసభలకు ముస్తాబైన కొత్తగూడెం

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 20: నేటి నుంచి జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర నాల్గవ మహాసభలకు కొత్తగూడెం పట్టణం ముస్తాబైంది. ప్రదర్శన జరిగే పాత డిపో నుంచి విద్యానగర్ వరకు, బస్టాం డ్ నుంచి ప్రతినిధుల సభ జరిగే కొత్తగూడెం క్లబ్ వరకు ఐద్వా జెండాలు, తోరణాలు, అమర వీరుల ఫొటోలతో అలంకరించారు. ఈ మహాసభల్లో 600 మంది ప్రతినిధులు పాల్గొంటారు. 21వ తేదీన ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయి. సభలో రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకారత్, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి, ప్రధాన కార్యదర్శి మరియం ధావలే తదితరులు పాల్గొంటారు.